**MOHAN ABHYAS Young Achiever Education**

తల్లి ఇంట్లో సమోసాలు తయారు చేస్తుంది..
తండ్రి సైకిల్‌పై తిరుగుతూ ఆ సమోసాలు అమ్ముకొస్తాడు..
వారి కుమారుడే మోహన్ అభ్యాస్...
ఇప్పుడు అందరూ ఈ అబ్బాయి గురించే మాట్లాడుకుంటున్నారు...
ఆ తల్లిదండ్రులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు...

13 సంవత్సరాల క్రితం భీమవరం నుంచి బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు సుబ్బారావు, నాగ సూర్యకళ.
కూకట్‌పల్లిలో ఓ అద్దె ఇంట్లో ఉంటూ బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. సూర్యకళ ఇంటివద్ద సమోసాలు తయారుచేస్తే... వాటిని ఇంటింటికి తిరిగి అమ్ముకొస్తారు సుబ్బరావు. ఆదాయం అంతంత మాత్రమే. తమలాగా తమ కుమారుడు కష్టపడకూడదని అనుకున్నారు. అందుకే ఎంత కష్టమైన భరిస్తూ కొడుకుని చదివిస్తున్నారు.

తల్లిదండ్రులు తనపైన పెట్టుకున్న ఆశలను వమ్ము చేయదల్చుకోలేదు అభ్యాస్. శ్రద్ధగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించి అమ్మానాన్నలను బాగా చూసుకోవాలనుకున్నాడు. చదువు తప్ప మరో ధ్యాస లేదు. ఎస్సెస్సీలో 9.7 జీపీఏ, ఇంటర్‌లో 975 మార్కులు తెచ్చుకున్నాడు. దేశ వ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు పోటీ పడిన జెఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియా లెవెల్‌లో 6th ర్యాంక్ సాధించాడు. 360 మార్కులకుగాను 345 మార్కులు తెచ్చుకున్నాడు. అంతేకాదు... ఏపీ ఎంసెట్‌లో ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుని తన సత్తా చాటుకున్నాడు అభ్యాస్.

అయితే అభ్యాస్‌కు కావలసింది ఇది కాదు. కలలు కనండి అని చెప్పిన అబ్దుల్ కలామ్ అతనికి ఆదర్శం. ఐఐటీలో చదవాలనేది అభ్యాస్ కల. ఆ కలను నిజం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ఐఐటీ మద్రాస్‌లో చేరి సైంటిస్ట్‌గా దేశానికి సేవ చేయాలనేది అభ్యాస్ ఆశయం.

ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించవచ్చునని నిరూపించిన మోహన్ అభ్యాస్‌కు బెస్ట్ విషెస్ చెబుతూ...ఎడ్యుకేషన్‌లో యంగ్ అచీవర్‌గా సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరిస్తోంది.